# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 03-10-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊతాన్ని ఇచ్చేందుకు పశుపోషణ చుట్టూ కేంద్ర ప్రభుత్వం ఒక సమగ్రమైన వ్యవస్థను అభివృద్ధి చేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.

- ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక వసతుల కల్పన, సంస్కరణల ద్వారానే భారత ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం, బలం సమకూరాయని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులో మాటను ప్రజలతో పంచుకునే రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' నేటితో 12 సంవత్సరాలు పూర్తి చేసుకుంది.

- ఆసియా క్రీడల్లో 85 పతకాలతో భారత్ నాల్గవ స్థానంలో నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = = =

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊతాన్ని ఇచ్చేందుకు పశుపోషణ చుట్టూ కేంద్ర ప్రభుత్వం ఒక సమగ్రమైన వ్యవస్థను అభివృద్ధి చేస్తోందని కేంద్ర హోం, సహకార శాఖా మంత్రి అమిత్ షా అన్నారు. ఈరోజు మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి 'గోపాలక్ సమ్మేళనం'లో ఆయన మాట్లాడుతూ.. ఆవు పేడను బయోగ్యాస్, సేంద్రీయ ఎరువులుగా మార్చడం నుండి డైరీ ఉత్పత్తుల ప్రాసెసింగ్, మార్కెట్ సదుపాయాలు కల్పించడం వరకు ఈ వ్యవస్థ అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటు వల్ల అత్యధికంగా లబ్ధి పొందే వారిలో పశుపోషకులు కూడా ఉంటారని పేర్కొన్నారు. నేరపూరిత న్యాయ సంస్కరణలపై అమిత్ షా మాట్లాడుతూ.. 'భారతీయ న్యాయ సంహిత' (BNS) పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చాక, భారతదేశపు క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ ప్రపంచంలోనే అత్యంత ఆధునికమైనదిగా మారుతుందని అభిప్రాయపడ్డారు. బిఎన్ఎస్ (BNS) సంపూర్ణ అమలు తర్వాత ఎఫ్ఐఆర్ (FIR) నమోదు నుండి సుప్రీంకోర్టు తీర్పు వరకు ఏ కేసైనా మూడేళ్ల వ్యవధిలోనే పరిష్కరించబడుతుందని అమిత్ షా వివరిస్తూ...

(వాయిస్...31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

గత దశాబ్ద కాలంగా పాటించిన ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక వసతుల కల్పన, నిరంతర సంస్కరణల ద్వారానే భారత ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం, బలం సమకూరాయని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన 5వ కౌటిల్య ఎకనామిక్ కాంక్లేవ్‌లో ఆమె ప్రసంగించారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో దేశం 7.8 శాతం వాస్తవ జీడీపీ వృద్ధిని నమోదు చేసిందని, గత నాలుగేళ్లలో ఎదురైన ప్రపంచ ఆర్థిక సవాళ్లను అధిగమించి, భారత ఆర్థిక వ్యవస్థ బలంగా నిలిచిందని ఆమె స్పష్టం చేశారు. ప్రపంచ దేశాల్లో అప్పుల భారం పెరుగుతున్న తరుణంలో, భారతదేశ ప్రభుత్వ అప్పు జీడీపీలో 2026 నాటికి ఉన్న 83.4 శాతం, 2031 నాటికి 77.7 శాతానికి తగ్గుతుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి అంచనా వేసినట్లు ఆర్థిక మంత్రి వివరించారు. ఈ

ఆర్థిక సంవత్సరానికి గాను మూలధన వ్యయం కింద 12 లక్షల 22 వేల కోట్ల రూపాయలను కేటాయించినట్లు తెలియజేశారు. 2014 నుండి జాతీయ రహదారుల నెట్‌వర్క్ దాదాపు 61 శాతం విస్తరించిందని, విమానాశ్రయాల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువైందని కేంద్రమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్...25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఆర్థిక, సామాజిక అభివృద్ధికి సంబంధించి విధానాలను రూపొందించేటప్పుడు విధానకర్తలు క్షేత్రస్థాయి పరిస్థితులను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 5వ 'కౌటిల్య ఎకనామిక్ కాంక్లేవ్-2026' లో ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విధానాలు మారే సౌలభ్యాన్ని కలిగి ఉండాలని, అలాగే వాటి అమలును సరిగ్గా పరిశీలించుకోవాలని ఉపరాష్ట్రపతి తెలిపారు. భారతదేశంలో ప్రస్తుతం జరుగుతున్న ఆర్థిక సంస్కరణలు, దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలు అందరి అంగీకారం సాధించే ప్రక్రియలోనే ఉన్నాయని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ఆర్థిక స్థిరత్వం అనేది సామాజిక స్థిరత్వం నుండి వేరు చేయలేనిదని, అభివృద్ధి ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు, దేశంలోని ప్రతి ప్రాంతానికి అందాలని ఆయన స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలో పెట్టుబడులను సమీకరించడం, నిధుల కొరత లేకుండా ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచడం కోసం బలమైన మూలధన మార్కెట్లు ఎంతైనా అవసరమని భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు-సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 12వ కమోడిటీ అండ్ క్యాపిటల్ మార్కెట్ పార్టిసిపెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. సాధారణ పెట్టుబడిదారులు నమ్మకంతో పెట్టుబడులు పెట్టేలా, వ్యాపారాలు తమ వృద్ధి కోసం నిధులను సమీకరించేలా, మార్కెట్ మధ్యవర్తులు ఉన్నత ప్రమాణాలను పాటించేలా మార్కెట్ వ్యవస్థను బలోపేతం చేయడానికి సెబీ నిరంతరం కృషి చేస్తోందని ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నెలకొకసారి తన మనసులో మాటను ప్రజలతో పంచుకునే రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' నేటితో 12 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. విజయాదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని 2014లో ఇదే రోజున ఈ కార్యక్రమం తొలి ఎపిసోడ్ ప్రసారమైంది. ఇటీవల 'మన్ కీ బాత్' 138వ ఎపిసోడ్ ప్రసారమైన విషయం తెలిసిందే. గడిచిన 12 ఏళ్లలో, దేశవ్యాప్తంగా జరుగుతున్న సానుకూల మార్పులను వెలుగులోకి తెచ్చేందుకు, భారత అభివృద్ధి ప్రయాణంలో పౌరులు చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించడానికి 'మన్ కీ బాత్' ఒక ప్రత్యేకమైన వేదికను అందించింది. ఈ నెలవారీ కార్యక్రమం ద్వారా విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, నూతన ఆవిష్కరణలు, సామాజిక సేవ వంటి రంగాల్లో మార్పు తీసుకువస్తున్న దేశ నలుమూలల ప్రజల స్ఫూర్తిదాయకమైన కథనాలను ప్రధానమంత్రి పంచుకుంటున్నారు. 'మన్ కీ బాత్' కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్‌ల ద్వారా ప్రసారం కావడంతో పాటు, AIR News వెబ్‌సైట్, Newsonair మొబైల్ యాప్‌లలో కూడా లభ్యమవుతుంది. అలాగే AIR News, DD News, PMO, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖల యూట్యూబ్ ఛానెళ్లలో కూడా ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారమవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

భారతీయ సంస్థలను విదేశీ పెట్టుబడులకు సిద్ధం చేయడం ద్వారా భారత్-అమెరికా ఆర్థిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో చార్టర్డ్ అకౌంటెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. చికాగో, మిచిగాన్, ఒహియో చాప్టర్లకు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' (ICAI) నాయకులు, సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. భారత్-అమెరికా ఆర్థిక భాగస్వామ్యంలో విస్తరిస్తున్న అవకాశాల గురించి ఈ భేటీలో చర్చించినట్లు పీయూష్ గోయల్ ఈరోజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. వ్యాపార సంస్థలు సరిహద్దు పన్నుల విధానం (క్రాస్-బోర్డర్ టాక్సేషన్), నిబంధనల అమలు, ఆర్థిక నిర్వహణను సరిగ్గా అర్థం చేసుకుని నిర్వహించడంలో చార్టర్డ్ అకౌంటెంట్లు సహాయపడుతున్నారని ప్రశంసించారు. బలమైన జిడిపి వృద్ధి, రికార్డు స్థాయి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రాకతో భారతదేశం ఆర్థిక పురోగతి సాధిస్తోందని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో ఈరోజు భారత క్రీడాకారులు ఐదు స్వర్ణాలు, రెండు రజతాలు రెండు కాంస్య పతకాలను గెలుచుకున్నారు. పురుషుల హాకీ జట్టు ఫైనల్ మ్యాచ్‌లో మలేషియాను 5-1 తేడాతో ఓడించి పసిడి పతకాన్ని నిలబెట్టుకోవడంతో పాటు 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది. మరోవైపు పురుషుల టీ-20 క్రికెట్ ఫైనల్లో పాకిస్తాన్ జట్టును ఓడించి భారత జట్టు స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. రెజ్లింగ్‌లో పురుషుల 57 కిలోల విభాగం ఫైనల్లో భారత్ రెజ్లర్ అమన్ సెహ్రావత్ ఉత్తర కొరియాకు చెందిన ప్రపంచ ఛాంపియన్ చోంగ్ సాంగ్ హాన్ పై 11-7 తేడాతో విజయం సాధించి, పసిడి పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. గోల్ఫ్ క్రీడలో వ్యక్తిగత విభాగంలో ప్రణవి ఉర్స్ ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన తొలి భారతీయ మహిళా గోల్ఫర్ గా నిలిచారు. ఇలా ఉండగా.. భారత్, 85 పతకాలతో పతకాల పట్టికలో నాల్గవ స్థానానికి చేరుకుంది. అందులో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్య పతకాలు ఉన్నాయి. పతకాలు సాధించిన వారిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందించారు.

= = = = = = = = = = = = = = = = = = =

పురుషుల క్రికెట్‌లో వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడో, చివరి వన్డేలో భారత్ భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ముల్లాన్‌పూర్‌లోని న్యూ చండీగఢ్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. భారత బ్యాటర్ కేఎల్ రాహుల్ కేవలం 87 బంతుల్లోనే 129 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. రోహిత్ శర్మ 92 పరుగులు చేయగా, రుతురాజ్ గైక్వాడ్ 57 పరుగులు సాధించాడు. అనంతరం బాటింగ్ ప్రారంభించిన వెస్టిండీస్ కడపటి వార్తలు అందే సమయానికి 22 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = =